క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సిహెచ్‌వి రామక్రిష్ణ ఓ ప్రకటనలో కోరారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, రాజీకాబడిన కేసులన్నీ పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

మదనపల్లె : అదనపు కట్నం కోసం వేధించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. మదనపల్లె పట్టణంలోని చౌడేశ్వరినగర్‌కు చెందిన హేమలత గురువారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అనంతరం టూ టౌన్ పోలీసులు బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి భర్త నవీన్, అత్తమామలు నాగేంద్రబాబు, సుగుణమ్మ, కుటుంబసభ్యులు భార్గవి, జ్యోతి, రవి, రాజాలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామన్నారు. బాధితురాలు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు తెలిపారు.

నేటి నుంచి చెంబకూరు దర్గాలో ఉరుసు

రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరు మూడు రోడ్ల కూడలిలో వెలసిన హజ్రత్ సుల్తాన్‌చమన్‌దార్‌అలీషాహుస్సేనిఖాదరి సర్వరీదర్గాలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఉరుసు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గంధం , ఆదివారం ఉరుసు జరగనున్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి ప్రముఖ ఖవ్వాలి గాయకుడు అంజద్‌చిష్తి, ముంబాయికి చెందిన మెయిన్‌నాజ్ ఆధ్వర్యంలో ఖవ్వాలీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న ఒక మహిళను అరెస్టు చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం రామానాయక్ తండాకు చెందిన బి.సరోజమ్మ నాటుసారా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడులో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని నింధితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

నాడు - నేడు పనుల తనిఖీ



పనులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ వెంకటరమణ

ములకలచెరువు: మండలంలోని సోంపల్లె ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను ఎంఈఓ వెంకటరమణ శుక్రవారం తనిఖీ చేశారు. పనుల నాణ్యత, పాఠశాలకు వచ్చిన ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను పరిశీలించారు. పనులు నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్స్‌ను ఆదేశించారు.

మూడు ఇసుక లారీలు సీజ్

గుర్రంకొండ: మండలంలో మూడు ఇసుక లారీలను పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్ జిల్లా వేంపల్లె నుంచి బెంగళూరుకు ఇసుక లోడ్‌తో వెళుతున్న మూడు లారీలను స్థానిక పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకొన్నారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పాటు అధిక బరువుతో వెళుతున్న లారీలను సీజ్‌చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

కలకడ : పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సిటీస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం మండలంలోని కదిరాయచెర్వు వడ్డిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది శ్రీనివాసులు, రాజేంద్రనాయక్, కాంతారావు, రమేష్‌లతో కలిసి దాడి చేశారు. జూదరుల నుంచి రూ.4020 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జగనన్న కాలనీకు ఉచితంగా విద్యుత్ మీటర్లు



ఈఈ సురేష్‌కుమార్

పీలేరు : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లు ఉచితంగా ఇస్తామని ట్రాన్స్‌కో ఈఈ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులకు విద్యుత్ మీటర్ల కోసం వ్యయప్రయాసలు పడాల్సిన అవసరం లేదన్నారు. మీటరు తోపాటు బోర్డు, సర్వీసు వైరు, ఇతర పరికరాలు లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి అమర్చనున్నట్లు తెలిపారు. ఇంటి పట్టా పత్రాలు, ఆధార్ జిరాక్స్ తమకు అందజేసి మీటర్లు పొందవచ్చునని చెప్పారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటేనే నష్ట పరిహారం వర్తిస్తుందని ఏఓ ప్రేమలత అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 2,921 ఎకరాల పంటలకు ఈ క్రాప్ నమోదు పూర్తి కాగా ఇంకా వెయ్యి ఎకరాల్లోని పంటలకు క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉందన్నారు.

పారదర్శక పాలన సీఎం జగన్‌కే సాధ్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: రాష్ట్రంలో పారదర్శకమైన పరిపాలన అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి పంచాయతీ చారావాండ్లపల్లి సచివాలయం పరిధిలోని ఎర్రగుంట్లబావి, గోవిందరాజుపురం, మేకలవారిపల్లి, రాములవారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ మెచ్చుకునేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడిపిస్తున్న పరిపాలనను దేశంలో ఇతర రాష్ట్రాలన్నీ ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ప్రజలకు మరింత మెరుగైన పరిపాలన అందించే లక్ష్యంతో ప్రతీ 25 కుటుంబాలకు ఒక గృహసారథిని నియమించారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా పరిపాలన అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అన్నిచోట్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత భారీ మెజార్టీతో విజయఢంకా మోగించి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా అందరూ సమన్వయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, సింగల్‌విండో అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, ఓరుగంటి రమేష్, ఫారుఖ్, నల్లంకి నరసింహులు, వెంకట్రమణారెడ్డి, మోహన్ రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, యల్లారెడ్డి, చెంగల్ రెడ్డి, ప్రియరంజన్ రెడ్డి, శీనా, నీలభాస్కర్, అబ్దుల్ కలీమ్, సురేష్ రెడ్డి, రాయుడు, ఆనంద, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదేవరాయల కీర్తి అజరామరం

– ఘనంగా విగ్రహ ప్రతిష్ట భూమిపూజ



విగ్రహప్రతిష్ట, భూమిపూజలో పాల్గొన్న పోకల అశోక్‌కుమార్, బలిజ జేఏసీ సభ్యులు

మదనపల్లె : దేశ చరిత్రలో అతిపెద్ద సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసి అందరిచేత మంచి పరిపాలనదక్షుడుగా పేరుమోసిన శ్రీకృష్ణదేవరాయల కీర్తి అజరామరమని టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని బసినికొండ పంచాయతీ బైపాస్‌రోడ్డు వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేయనున్న శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు శుక్రవారం భూమిపూజ చేశారు. మదనపల్లె బలిజ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్‌టీకే చైర్మన్ కత్తిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి బలిజకుల ప్రతినిధులు కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ..బలిజల చిరకాల కోరికను నెరవేర్చేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సహకారం అందించడంపై అభినందనలు తెలిపారు. బలిజ జేఏసీ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటును త్వరితగతిన పూర్తిచేసి త్వరలోనే ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. విగ్రహ ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేయించడంలో కీలకంగా వ్యవహరించిన అప్పటి సర్పంచ్ కత్తికృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేఏసీ ప్రెసిడెంట్ మునిరత్నం, అండేశివ, ప్రసాద్, సాయిలోకేష్, ఆకులగజేంద్ర, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, రాయదుర్గంరాజా, బోర్‌వెల్‌సుధా, రాజ్‌భవన్‌రాజా, ఆనందపార్థసారథి, శ్రీనివాసులు, మంజునాథ్, వైస్ ఎంపీపీ పసుపులేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణానాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణానాయక్

కలకడ : ఆకతాయిలపట్ల విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలలో కానీ, కుటుంబంలో ఎక్కడ ఎలాంటి సమస్యలు ఎదురైనా విద్యార్థినులు ధైర్యంగా ఉన్నతాధికారులకు తెలియజేయాలని జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థిలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాల్యవివాహాలు, విద్యార్థినులపై దాడులు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అలాగే బాలికల సంరక్షణకు దిశయాప్‌తో పాటు ప్రత్యేక చట్టాలను ప్రభుత్వం తీసుకువచ్చిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏడీ పెద్దవెంకటయ్య, అసిస్టెంట్ సీడీడీపీఓ కృష్ణమంజిరి, వైద్యాధికారి మల్లికార్జున, ఎంఈఓ మునీంద్రనాయక్, ప్రిన్సిపాల్ మలంగ్‌షావల్లీ పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణకు కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న వాల్మీకి కులసంఘు పెద్దలు

మదనపల్లె : వాల్మీకి, బోయ కులస్థులను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణకై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లనున్నట్లు ఏపీ వాల్మీకిసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులిశ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నక్కలదిన్నెలోని షటిల్‌కోర్టులో వాల్మీకి కుల పెద్దలు, మేధావులతో కార్యాచరణ రూపొందించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలో చేర్చేందుకు శ్యామూల్స్ ఆనంద్ ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిషన్ కాలపరిమితి ముగియడంతో తదుపరి కార్యాచరణపై పెద్దల సమావేశంలో చర్చించారు. ఎస్టీ జాబితాలో ఉండాల్సిన వాల్మీకి, బోయలను బీసీ-ఏగా విభజించేందుకు ముఖ్యకారణం రాజకీయ స్వలాభమేనన్నారు. బ్రిటీష్ కాలం నుంచి వాల్మీకులు ఎస్టీలుగా గుర్తింపు పొందితే.. ప్రస్తుతం మైదానప్రాంత వాల్మీకులు బీసీలుగా ఉన్నారన్నారు. ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు వెంటనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సద్దల జయసింహ, గాదెభాస్కర, కొత్తఉడుంశంకర, సర్పంచ్ ప్రభాకర, చీకలబైలు రవి, తిమ్మయ్య, కమలమ్మ, శ్యామలమ్మ, గీత, భాగ్యమ్మ, రెడ్డిశేఖర్, మంజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జులేఖాబేగం

నిమ్మనపల్లె : గర్భిణులు వైద్యుల సూచనలు తప్పక పాటించి పౌష్టికాహారం తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖాబేగం అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా 9,10 తేదీల్లో కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి హైరిస్క్, రక్తహీనత కలిగిన వారిని గుర్తిం మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. వైద్యపరీక్షలకు 74 మంది గర్భిణులు హాజరుకాగా 22 మందికి హైరిస్క్ ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్‌హెల్త్‌నర్స్ సరోజ, సూపర్‌వైజర్ దేవకుమారి, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న నరేంద్రకుమార్‌రెడ్డి

పీలేరురూరల్ : భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు శక్తివంచలేకుండా కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి అనారు. శుక్రవారం మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నిమ్మనపల్లె పురుషోత్తం, బీజేపీ కిషన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్రనాయుడు, నాయకులు నారాయణస్వామి, సుధారాణి పాల్గొన్నారు.

కేవీపల్లె : బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండ్లూరు రామాంజులు, నాయకులు తాతయ్య, అల్లాబక్షు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేవీకే కో-ఆర్డినేటర్‌గా పాండురంగ

కలికిరి: తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో కీటక శాస్త్ర విభాగ అధ్యాపకుడు డాక్టర్ పాండురంగ స్థానిక కేవీకే నూతన కో-ఆర్డినేటర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేవీకే కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు మరింత చేరువ చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. కాగా ఇక్కడ పనిచేసిన కేవీకే కో-ఆర్డినేటర్ జ్యోత్స్న తిరుపతి వ్యవసాయ కళాశాలకు బదిలీ అయ్యారు.

మోడల్ స్కూల్ హాస్టల్ తనిఖీ

ములకలచెరువు: స్థానికంగా ఉన్న మోడల్ స్కూల్ హాస్టల్‌ను పశు సంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేరకు హాస్టల్‌లోని విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా, వైద్య పరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

నేడు వాహనాల వేలం

రామసముద్రం: రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలను శనివారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఆటో, ఒక కారు, 21 ద్విచక్రవాహనాలు వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు వాహనాలకు నిర్దేశించిన ధరలో 50 శాతం డబ్బులు ముందుగా చెల్లించి తమపేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పీలేరు : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంజేఆర్ కళాశాల చైర్మన్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాల పొండర్ వెంకటరమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చిత్తూరు, మదనపల్లె ప్రభుత్వాస్పత్రుల వైద్యుల ఆధ్వర్యంలో రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని సూచించారు. శిబిరంలో 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నూతన ధ్వజస్తంభాన్ని వేదపండితులు ప్రతిష్ఠించారు. ఆలయంలో బాహ్య నందిమండపం, కాలభైరవ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో హోమాలు నిర్వహించారు. దాతలు మర్పూరి సుధాకర్‌నాయుడు, విజయలక్ష్మి భాస్కర్ కుటుంబసభ్యులను అర్చకులు సన్మానించారు. ఈఓ రమణ, అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, బాలాజీ, శివకుమార్‌శర్మ, డాక్టర్ శ్రీదేవి, కంభం నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్లతో నేడు ఎమ్మెల్యే సమీక్ష

పెద్దతిప్పసముద్రం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శనివారం పీటీఎం కింగ్ వెడ్డింగ్ హాల్లో జరిగే సమీక్షకు హాజరతారని ఎంపీపీ మహమూద్, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ పరిశీలకులు ఇరగం సుబ్బారెడ్డిలు హాజరయ్యే ఈ సమీక్షకు మండలంలోని గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోరారు.

షార్‌లో మదనపల్లె విద్యార్థుల సందడి



మదనపల్లె : శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్)లో మదనపల్లె విద్యార్థులు శుక్రవారం సందడి చేశారు. ఎస్ఎస్ఎల్‌వి-డి2 ప్రయోగాన్ని క్షేత్రస్థాయిలో చూసేందుకు పట్టణానికి చెందిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు శ్రీహరికోటకు వెళ్లారు. రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడాన్ని నేరుగా చూసిన విద్యార్థులు ఇస్రో ఆల్ ది బెస్ట్ అంటూ చేసిన సందడి పలువురిని ఆకర్షించింది. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ షెహనాజ్‌ఖాన్, జ్ఞానాంబిక ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

– డ్వామా పీడీ మద్దిలేటి



మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న డ్వామా పీడీ మద్దిలేటి

తంబళ్లపల్లె: బాలికల ఆరోగ్యం, భద్రతపై దృష్టిసారించాలని డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేరకు మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. టీచర్ల హాజరు, పనితీరు, బోధన తీరుపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల వంటగది, స్టోర్ రూమ్, బాలికల వసతిగృహాలను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి, కుక్కింగ్ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. బాలికలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు ఆరోగ్యం పట్ల ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్తహీనత నివారణ, చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహనతో పాటు మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు 100,112,181,1098,108,104 ఆవశ్యకత, దిశా యాప్ ప్రాముఖ్యత గుర్తించాలన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్‌కుమార్, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎంఈఓ త్యాగరాజు, ఉపాధి ఇంజినీర్ రామన్న, ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్వేత పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం

– సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

మదనపల్లె : దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలన్న రాష్ట్రప్రభుత్వ నిర్ణయంపై పట్టణంలోని నాయీబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణ సంఘం నేతలు మాట్లాడుతూ.. తాజా ఆర్డినెన్స్‌తో దేశచరిత్రలోనే తమ కులానికి అరుదైన గౌరవం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో అవమానించే వారిపై చర్యలు తీసుకునేలా జీఓ నంబర్ 50ని విడుదల చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి అడుగులోనూ తమ ఆత్మగౌరవాన్ని కాపాడేదిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. జగనన్న చేదోడు, రూ.10,000 ఆర్థికసహాయం, ప్రతిషాప్‌కు 150 యూనిట్ల ఉచిత విద్యుత్, నవరత్నాలు, బీసీ సంక్షేమంలో భాగంగా అనేక పథకాలు నాయీబ్రాహ్మణులకు అమలు చేస్తున్నారన్నారు. ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య అభ్యర్థన మేరకు, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకురావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు యం.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి శంకర, ఆవుల విశ్వనాథ, బూరుగల సుబ్రహ్మణ్యం, ఆర్మీ వెంకటస్వామి, విశ్వనాథ, పి.వెంకటరమణ, వెంకటేష్, నరసింహులు, అమరనారాయణ, సుధాకర, వినోద్‌కుమార్, సాయిప్రసాద్, రామ్మూర్తి, మహేష్ పాల్గొన్నారు.

రాజ్యాధికార చైతన్యయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రామసముద్రం: ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార చైతన్యయాత్ర బహిరంగ సభకు చెందిన కరపత్రాలను శుక్రవారం బిఎస్పీ మండల నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బిఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ హాజరైయ్యారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జనవరి 26వ తేదీన పాడేరు నియోజకవర్గంలో మొదలైన బహుజన రాజ్యాధికార చైతన్యయాత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పర్యటిస్తూ ఈనెల 20వ తేదీన మదనపల్లెకు చేరుకుంటుదన్నారు. పట్టణంలోని టిప్పు సుల్తాన్ గ్రౌండ్ నుంచి సాయంత్రం 4 గంటలకు భారీ ర్యాలీగా మొదలై మిషన్‌కాంపౌండులో బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. బహుజన ప్రజలు సభకు విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పార్థసారథి, మండల నాయకులు కరాటే రాచంద్ర, మాజీ ఎంపీటీసీ హనుమప్ప, బీసీ నాయకులు రమణప్ప, అచ్యుతరావు, సుబ్రమణ్యం, రవి, చంద్రప్ప, రమణ, గాంగధర్, హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల్లో మానసిక ధైర్యం పెంపొందించాలి



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమాధికారి జాకీర్‌హుస్సేన్

పీలేరు రూరల్ : విద్యార్థినుల్లో మానసిక ధైర్యం పెంపొందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జాకీర్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని మహాత్మా జ్యోతీరావ్‌పూలే బాలికల గురుకుల పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల అకడమిక్ రిజిష్టర్, హెల్త్ రిజిష్టర్లను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందుతోందా, లేదా ? అని అడిగి తెలుసుకున్నారు విద్యాబోధనలో నాణ్యత ఉండాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో జయప్రకాష్, ఎంఈవో బాలాజీనాయక్, ప్రిన్సిపాల్ రాధారాణి, సీఆర్‌పీ మురళీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులు రోడ్డు నిబంధనలు పాటించాలి



ఎంవీఐ విజయకుమారిని సత్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

పీలేరు : ఆటో కార్మికులు రోడ్డు నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ విజయకుమారి అన్నారు. శుక్రవారం బిస్మిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కోటపల్లె వివేకానంద సర్కిల్ వద్ద ఆటో స్టాండ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలన్నారు. డ్రైవర్లు క్రమశిక్షణతో నడుచుకోవాలని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. అనంతరం ఎంవీఐ విజయకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, మాజీ సర్పంచ్ హుమయూన్, ఆటో యూనియన్ అధ్యక్షుడు బోదేషావలి, కార్మికులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చేయూత



సరస్వతి విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న దాత కనుగొండమద్దిరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలో విద్యాభివృద్ధికి మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి చేయూత ఇస్తున్నారు. శుక్రవారం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్లో సొంత నిధులతో చదువుల తల్లి సరస్వతీ విగ్రహాలు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టారు. త్వరలో సంప్రదాయబద్ధంగా సరస్వతి విగ్రహాలు నెలకొల్పేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మల్లయ్యకొండ శ్రీభ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించారు. పూజారి ఈశ్వరప్ప పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కృషితో ఆలయం దినాదినాది అభివృద్ధి చెందడం ఆనందంగా ఉందన్నారు.

నేడు అవగాహన సదస్సు

ములకలచెరువు: స్థానిక కేజీఎస్ ఫంక్షన్ ల్‌లో శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యు డు మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.